


# కథ

**సోమవఝల నాగేంద్రప్రసాద్**

# గురుదక్షిణ

"ఏమండీ మీరిలాగే ఆదర్శం, నీతి నిజాయితీ అంటూ వచ్చిన పిల్లలకి ఊరికే ట్యూషన్లు చెబుతూ ఉండండి. అవతల మీ సహోద్యోగులు మీలాగే ప్రైవేట్లు చెబుతూ వేలకు వేలు సంపాదిస్తున్నారు" సుప్రభాత వేళ ఖంగుమని వినిపించింది అన్నపూర్ణ గొంతు.

"అబ్బా ఊరుకో పూర్ణా! ఇప్పుడేమైందని. నాకు దేనికీ లోటు లేదు. ఏదో నా దగ్గరికి వచ్చిన విద్యార్థులకు నాలుగు అక్షరం ముక్కలు నేర్పుతున్నాను. అయినా విద్యను నమ్ముకోవాలి గాని అమ్ముకోవడం పాపం" రోజూ భార్య మాటలకు అలవాటుపడిన శంకరం మాష్టారు చదివిన ఆనాటి పేపరుని ప్రక్కన పెడుతూ అన్నారు.

"ఇప్పుడు మీ మాట కాదని ఎవరన్నారు. కానీ దీపముండగానే ఇల్లు చక్కపెట్టుకోవాలి. అయినా మీ దగ్గర ఇంతకాలం ఎంతోమంది విద్య నేర్చుకుని, ఈరోజు ఎంతో మంచి మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఏనాడైనా, ఎవరైనా వచ్చి 'మాష్టారు ఎలా ఉన్నారు?' అని అడిగిన పాపాన పోయారా?" దెప్పి పొడుపుగా అంది.

"ఊరుకో పూర్ణా! వాళ్ళు అలా మంచి హోదాలో ఉన్నందుకు మనం గర్వపడాలి కాని వారి వద్దనుండి ఏదో ఆశించడం తప్పు. ఫలానా శంకరం మాష్టారు మా గురువుగారు అని వాళ్ళు నా గురించి నలుగురికి గొప్పగా చెబుతుంటే నాకెంత తృప్తిగా ఉంటుందో ఏనాడైనా ఆలోచించావా? ఆ తృప్తి ముందు నేను తీసుకునే ధనం ఏపాటిది" బాధగా అన్నాడు.

"అదికాదండి! మీ జీతమా అంతంత మాత్రం. మీ ఒక్కరి సంపాదనతో ఈ సంసారం ఎలా గడుస్తుంది? రోజురోజుకి ధరలా మండిపోతున్నాయి. అమ్మాయిది కూడా ఇంజనీరింగ్ పూర్తవుతోంది. దాన్ని మన తాహతుకు తగ్గ సంబంధాన్ని చూసి ఓ అయ్య చేతిలో పెట్టాలి గదా" ఆయనకు కాఫీ ఇస్తూ అంది అన్నపూర్ణ. "చూడు పూర్ణా నీ బాధ, ఆందోళన నాకు అర్థమైంది. అయినా గాయత్రికి ఏం తక్కువని. అందానికి అందం, చదువుకి చదువు, దాని పెళ్ళి హాయిగా జరుగుతుంది" టేబులు మీది కూతురు గాయత్రి ఫోటోను చేత్తో ఆత్మీయంగా తడుముతూ అన్నాడు శంకరం.

"మీరిలాగే మురిసిపోండి. అయినా ఆడపిల్లకి ఎంత అందమున్నా, ఎంత విద్య ఉన్నా ఏం విలువ లేదు. ఎందుకంటే ఈ రోజుల్లో పెళ్ళికొడుకులు లక్షల్లో ఉన్నారు, ఆ విషయం మర్చిపోకండి. పోనీ ఎవరైనా ఆదర్శం కోసం కట్నం లేకుండా చేసుకోవడానికి ముందుకు వచ్చినా, ఆ అబ్బాయి తల్లిదండ్రులు అందుకు ఒప్పుకోరు. ఒకవేళ ఒప్పుకున్నా ఆ తర్వాత కట్నం తేలేదని కోడల్ని వేధించరని గ్యారంటీ ఏమిటి?" మాట్లాడుతున్న అన్నపూర్ణ ఫోను మోగడంతో మౌనంగా ఉండిపోయింది.

"హలో..ఎవరూ! ఆ.. శాస్త్రిగారా... ఏంటి సంగతి.. ఆహా అలాగా! చాలా సంతోషం. సరే, మీరే ఓ మంచిరోజు చూసి వాళ్ళని అమ్మాయిని చూసుకోవడానికి రమ్మనమని మా తరపున చెప్పండి. సరే మంచిది ఉంటాను!" అంటూ ఫోను పెట్టేసిన శంకరం, అమ్మాయి గాయత్రిని చూసుకోవడానికి త్వరలోనే పెళ్ళివారు వస్తున్నట్లుగా ఆమెతో చెప్పి స్నానానికి లేచాడు.

* * *

"సరే శంకరంగారూ, మాకు పిల్ల నచ్చింది. మిగతా విషయాలు గూడా ఓమారు మాట్లాడుకుంటే" చెప్పడం ఆపిన పెళ్ళికొడుకు తండ్రి శాస్త్రి వంక ఇంక నువ్వు మాట్లాడు అన్నట్లుగా చూసాడు.

"అదేనండి శంకరం మాష్టారూ! అబ్బాయి చెల్లికి ఓ పదివేలు ఆడపడుచు కట్నంగాను, అబ్బాయికి ఓ లక్ష ఇమ్మనమని వారు అంటున్నారు, ఏమంటారు?" అన్నాడు శాస్త్రి.

"అనడానికేముంది, నా స్థితిగతులు మీరు తెలిసే వచ్చారు. పైగా మా అమ్మాయి ఇంజనీరింగ్ పూర్తిచేస్తోంది. అలాగే మొన్న జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూలో సెలక్ట్ అయింది కూడాను. కాబట్టి మీరన్న ఆ పదివేలు ఆడబడుచు కట్నంతోపాటు, పెళ్ళి ఘనంగా మీ తాహతుకు తగ్గట్లుగా జరిపిస్తాను" శాస్త్రిగారితో చెప్పినట్లుగా అంటూ పెళ్ళికొడుకు తండ్రి వైపు చూసాడు శంకరం.


"చూడండి శంకరంగారూ! ఈ రోజుల్లో ఆదర్శాలకు పోతే మనకు ఏమీ మిగలదు. మీ గురించి నేను చాలా మంచిగా విన్నాను. మీ తోటివాళ్ళు ప్రైవేట్లు చెప్పి వేలు సంపాదిస్తుంటే మీరు మాత్రం మడిగట్టుకుని ఆదర్శాలు, నీతి సూత్రాలు వల్లెవేయడం మినహా ఏమి చేసారు. మా సంబంధం కాకుండా వేరే వాళ్ళైనా మీ పిల్లని కానీ కట్నం లేకుండా చేసుకోవడానికి ముందుకు రారు. ఒకవేళ వచ్చినా, ఆ అబ్బాయికి ఏదో లోపముంది అందుకే ఏమీ కట్నం లేకుండా చేసుకుంటున్నారు అని అంటుంది ఈ పాడులోకం. అందుచేత నా మాట విని మీ వీలుచూసుకుని ఆ కట్నం డబ్బులు ఏర్పాటు చేయండి. కావాలంటే అంతవరకు మేం ఆగుతాం" అంటూ శంకరం మాష్టారి దగ్గర శెలవు తీసుకుని బయలుదేరారు మగ పెళ్ళివారు.

* * *

"ఏవండీ, దేని గురించండి అంతలా ఆలోచిస్తున్నారు. అమ్మాయి పెళ్ళి గురించా?" పెరట్లో పూసిన కనకాంబరాలను మాలగా కడుతూ అడిగింది పూర్ణ.

"ఊ..." అంటూ ముక్తసరిగా సమాధానం ఇచ్చిన మాష్టారు వాలుకుర్చీలో వెనక్కువాలి బాధగా కళ్ళు మూసుకున్నారు.

"ఏమండీ నా మాట విని మీరు ఎక్కువగా దాని గురించి ఆలోచించి మీ ఆరోగ్యాన్ని పాడుచేసుకోకండి. ఈ సంబంధం కాకపోతే మరొకటి, దాని అదృష్టం ఎలా ఉంటే అలా జరుగుతుంది" కట్టిన మాలలోని సగం మాలను దేముడి ఫోటోకు వేసి,




మిగతా మాలను తన జడలో పెట్టుకుంటూ అంది పూర్ణ.

"నిజమే పూర్ణా, కానీ చూస్తూ చూస్తూ ఇంత మంచి సంబంధాన్ని వదులుకోవాలంటే చాలా బాధగా ఉంది" పడక్కుర్చీలో నిశారుగా కూర్చుంటూ అన్నాడు శంకరం.

"ఏవండీ మీరు ఏమీ అనుకోనంటే నాదో మాట" అంటూ అతనికేసి చూసింది.

"చెప్పు, కరణేషు మంత్రి అన్నారుగా" నవ్వుతూ అన్నాడు.

"ఏం లేదండి, ఆ కట్నం డబ్బును మీకు తెలుసున్నవాళ్ళ దగ్గర చేబదులుగా తీసుకుంటే" ఆమె మాటలు పూర్తి గాకముందే చివాలున కుర్చీలోనుండి లేచిన శంకరం "చూడు పూర్ణా! నా సంగతి తెలిసి కూడా ఇటువంటి సలహాలు ఎందుకు ఇస్తావు? ఇంతవరకు పుట్టి బుద్ధెరిగి ఎవరి దగ్గరా దేహీ అని చేయి చాపలేదు, ఇకముందు కూడా చాచబోను" అంటూ విసురుగా కుర్చీలోంచి లేచాడు.

"ఏవండీ మీకే కాదండి ఆ మాత్రం ఆత్మాభిమానం, ఆత్మగౌరవం నాకూ ఉన్నాయండీ. అయినా నేను ఇప్పుడేమన్నాను, మీరు ఎంతోమంది పిల్లలకు స్కూలు ఫీజులు కూడా కట్టారు. అప్పుడంటే వాళ్ళు డబ్బుల్లేక ఫీజులు కట్టలేకపోయారు. కానీ ఈనాడు ఆ పిల్లలు, వారి తల్లిదండ్రులు బాగానే ఉన్నారు, వెళ్ళి వాళ్ళనే అడగమన్నాను అంతేగా... అయినా మీనుండి సహాయం పొందినవారిని మీరు తిరిగి అడిగినంత మాత్రాన మీ అభిమానానికి, ఆత్మగౌరవానికి లోటనుకుంటే ఎల్లా?" నిట్టూరంగా అంది.

నేను అలా చేసింది వారి దగ్గరనుండి ఏదో ఆశించి కాదు. అలా చేస్తే అది స్వార్ధం అవుతుంది. నేను ఇప్పుడు వాళ్ళని అడిగి స్వార్ధపరుణ్ణి అనిపించుకోలేను" అని అన్న శంకరం నిస్త్రాణంగా తిరిగి కుర్చీలో కూలబడిపోయాడు.

* * *


"ఏమిటి మాష్టారు ఏమైంది? సడనుగా రెండు రోజులు మీరు స్కూలుకి రాకపోయేసరికి ఏదోలా ఉంది" శంకరం మాష్టారుని పలకరిస్తూ అన్నాడు హెచ్.ఎమ్.

"ఏం లేదు సార్! ఏదో ఒంట్లో బాగుండక రాలేకపోయాను" మంచం మీద నుండి లేవబోతూ



అన్నాడు.

"ఆహా..మీరు లేవకండి మాష్టారు. మిమ్మల్ని చూస్తుంటే మీరు దేనికో మానసికంగా చాలా బాధపడుతున్నారు అనిపిస్తోంది. ఇటువంటివి నలుగురితో పంచుకుంటేనే తగ్గుతాయి" చనువుగా మాష్టారి భుజం మీద చెయ్యి వేస్తూ అన్నాడు హెచ్.ఎమ్.



"నిజమే సార్. అయినా ఇంట్లో ఎదిగిన ఆడపిల్ల ఉన్న ప్రతి తండ్రికి ఈ మానసిక క్షోభ తప్పదనుకుంటా" తనలో తానే స్వగతంగా అనుకుంటున్నట్లుగా పైకి అన్నాడు శంకరం.

"చూడండి మాష్టారు, విషయం నాకూ కొంచెం తెలిసింది. పోనీ ఎవరి దగ్గరైనా అప్పు తీసుకోండి" ఎంతో క్యాజువల్‌గా అన్న హెచ్.ఎమ్. వంక అదోలా చూసిన శంకరం "చాలా థాంక్స్ హెచ్ ఎమ్‌గారు. ఆ అవసరం వస్తే తప్పకుండా అడుగుతాను" అంటూ అతను తలగడ మీదకు వాలి కళ్ళుమూసుకోవడంతో అక్కడనుండి బయటకు నడిచాడు హెచ్.ఎమ్.

* * *

ఓనాడు ఆదివారం ఇంట్లో కూర్చుని పేపరు చదువుతున్న శంకరం మాష్టారు కాలింగ్ బెల్లు మోగడంతో "అమ్మా...గాయత్రీ ఎవరో చూడు" అని పిలిచారు.

"ఏంటి మాష్టారు, ఎలా ఉన్నారు?" అంటూ ఎంతో ఆప్యాయంగా మాష్టారుని పలకరించారు అక్కడికి వచ్చిన కొంతమంది విద్యార్థులు.

వారు చూపిస్తున్న గౌరవానికి మనసులోనే పొంగిపోయిన శంకరంగారు "నేను బాగానే ఉన్నాను. మీరెలా ఉన్నారు? మీ ఉద్యోగాలు ఎలా ఉన్నాయి" అంటూ తనని చూడడానికొచ్చిన పాత విద్యార్థులందరినీ పేరు పేరునా అడిగి తెలుసుకున్నారు.

"మాష్టారు మీ దయ వలనే మేము ఈనాడు ఎంతో మంచి హోదాల్లో ఉన్నాం. ఆనాడు మీరు మమ్మల్ని ఆదరించి ఫీజులు కట్టారు. అలాగే మాకు ఊరికే ట్యూషను చెప్పి మమ్మల్ని ఎంతో ఉన్నతమైన విద్యార్థులుగా తీర్చిదిద్దారు. ఈనాడు మేం ఇలా ఉన్నామంటే అది మీ చలవే మాష్టారు" అంటూ విద్యార్థులందరూ ఏక కంఠంతో అన్నారు.

"ఇందులో మా గొప్పదనం ఏం లేదు నాయనా. నేను చెప్పింది శ్రద్ధగా నేర్చుకుంటూ స్వశక్తితో వృద్ధిలోకి వచ్చారు. ఓ మాష్టారిగా నాకీ ఆనందం చాలు" అన్న శంకరం మాష్టారి కళ్ళల్లో కన్నీళ్ళు రావడంతో వారికి తెలియకుండా భుజం మీది తుండుతో తుడుచుకున్నారు.

అంతలో వాళ్ళందరికీ అన్నపూర్ణ మిఠాయిలు తీసుకుని రావడంతో "బావున్నారా అమ్మగారూ!" అంటూ ఆమెని కూడా ఎంతో ఆప్యాయంగా పలకరించిన విద్యార్థులు "సార్ మీ గురించి హెచ్.ఎమ్ గారి ద్వారా అన్నీ తెలుసుకున్నాం. మీరు కాదనకుండా వీటిని స్వీకరించండి" శంకరం మాష్టారి చేతిలో కొన్ని కవర్లు పెడుతూ అన్నారా విద్యార్థులు.

"ఏమిటి నాయనా ఇవి. అప్పుడే మీ దగ్గర డబ్బు తీసుకోని నేను ఇప్పుడు మాత్రం ఎలా తీసుకుంటాను అనుకున్నారు. శిష్యులుగా మీరు ఈ గురువు మీద చూపించిన అభిమానం చాలు" అంటూ ఎంతో హుందాగా వాళ్ళు కవర్లతో ఇచ్చిన డబ్బుని తిరస్కరించాడు శంకరం.

"మాష్టారు మీ సంగతి మాకు బాగా తెలుసు. కానీ ఇది మేం మీకు జాలితో ఇవ్వడం లేదు. ఆనాడు మేం ఇవ్వలేని స్థితిలో ఉన్నాం కనక ఇవ్వలేకపోయాము. కానీ ఈనాడు మీ దయవల్ల ఇంకొకరికి ఎంతోకొంత సాయం చేసే స్థితిలో ఉన్నాం. మీరు ఎప్పుడూ ఓ మాట అంటూ ఉండేవారు. 'మనకున్న దాన్ని ఇతరులకు కూడా పంచాలి' అని. గుర్తుందా మాష్టారు. మరి ఈనాడు మేం చేస్తున్న ఈ చిన్న సాయాన్ని ఎందుకు కాదంటున్నారు? అయినా ఇది మీకు మేం చేస్తున్న సాయంకాదు, భక్తితో మీకు సమర్పించుకుంటున్న 'గురుదక్షిణ'. దీనితో మన గాయత్రి వివాహం జరిపించండి మాష్టారు" అంటూ మరలా ఆ డబ్బుని తిరిగి బలవంతంగా ఆయనకి ఇవ్వడంతో కాదనలేని శంకరంగారి కళ్ళను మరలా కన్నీటి పొర కప్పేయడంతో, నోటి మాట రాక శంకరం మాష్టారు వాళ్ళని ఇంకా ఇంకా వృద్ధిలోకి రావాలని మనసులోనే దీవించాడు.

## బడాయి హన్సిక!

కుర్రతార హన్సిక మరీ చిన్నపిల్ల ఏం కాదంటున్నారు సినీజనాలు. ఎందుకంటే ఆమెకి తెలుగులో చెప్పుకోదగిన సినిమాలు లేకపోయినా కూడా తెగ పోజులు కొట్టేస్తోందిట. తనకి కథ బొత్తిగా నచ్చక ఏకంగా 8 సినిమాలను తిరస్కరించానని ఈమధ్య సెలవిచ్చిన మాటలో ఏమాత్రం నిజం లేదంటున్నారు. ఎందుకంటే అన్ని సినిమాలు రిజెక్ట్ చేసేంత సీన్ ఆమెకి లేదని తన గొప్పదనాన్ని చాటుకోడానికి లేనిపోని బడాయిలు చెప్పుకోవడం ఆమెకి మామూలేననేది టాలీవుడ్ జనాల ఉవాచ. ఏమైనా హన్సిక కనిపించేంత అమాయకురాలేం కాదన్నమాట!